# విశాల భారతి

తెలుగు దినపత్రిక

06-07-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com


సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 182


## మూడు బ్యారేజీలు రిపేర్ చేస్తం



- ఐఐటీ బాంబే నివేదిక వస్తే అన్ని తెలుస్తయ్
- డయాఫ్రమ్ వాల్ కట్టాల్సి వస్తదేమో
- బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగిస్తలేం
- కళేశ్వరం కట్టింది, కూలింది బీఆర్ఎస్ ఉన్నప్పుడే
- నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలితే భద్రాచలం, 44 గ్రామాలు కొట్టుకుపోతయ్
- బీఆర్ఎస్ నేతల తీరు ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే అన్నట్లు ఉంది
- కేటీఆర్ నాటకాలాడుతున్నారు
- బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్ ధ్వజం

03



## కాళేశ్వరం మోటార్ల చుట్టూ హైడ్రామా

ఉద్రిక్తతలు, క్షేత్రస్థాయి పర్యటనలతో పార్టీల మధ్య ఘర్షణ

- పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలంటున్న బీఆర్ఎస్
- ప్రభుత్వ వాదన, పిల్లర్లు కుంగి ఉన్నాయి, నీటి నిల్వ ప్రమాదకరం
- పంపింగ్ చేస్తే దిగువ గ్రామాలు మునిగే అవకాశం ఉంది
- నిపుణుల రిపోర్ట్, 2027 దాకా మరమ్మతులు పూర్తి కావు
- రాజకీయ ఆరోపణలు, అవినీతి, కక్ష సాధింపులపై విమర్శలు

02

## ధరణిలో 10 వేల ఎకరాల రికార్డుల మాయం

- 10,000 ఎకరాల భూ రికార్డులను అక్రమంగా మార్చారు
- ప్రత్యేక కమిటీతో ప్రభుత్వం విచారణ మొదలుపెట్టింది
- సాఫ్ట్‌వేర్ లోపాలు, అధికారుల లాగిన్‌లను వాడారు
- ప్రైవేట్ ఏజెన్సీల ప్రమేయంపై అనుమానాలున్నాయి
- 15 రోజుల్లో నివేదిక రాగానే క్రిమినల్ కేసులు నమోదు
- కొత్త పోర్టల్‌ను మరింత పటిష్టం చేస్తున్నారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రాజకీయ, రియల్ ఎస్టేట్ వర్గాలను కుదిపేస్తున్న ధరణి పోర్టల్ అక్రమాల వ్యవహారం ఇప్పుడు అత్యంత క్లిష్టమైన మలుపు తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ డిజిటల్ వ్యవస్థ, నేడు వేలాది ఎకరాల భూ కుంభకోణానికి అడ్డగా మారిందనే నిజం ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ద్వారా వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10,000 ఎకరాల విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూముల యాజమాన్య హక్కులను అధికారిక రికార్డుల్లో అడ్డగోలుగా మార్పులు చేసినట్లు సంచలన ఆధారాలు బయటపడ్డాయి. ఈ మెగా ల్యాండ్ స్కామ్ వెనుక ఉన్న చీకటి కోణాలను ఛేదించడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఐటీ నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని సాగిన ఈ భారీ అక్రమ లావాదేవీలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని క్షేత్రస్థాయి అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ తాజా విచారణాంశాల ప్రకారం, ధరణి పోర్టల్ సిస్టమ్ ఆర్కిటెక్చర్‌లో పొందుపరిచిన సాంకేతిక లోపాలు, భద్రతా ప్రమాణాల వైఫల్యాలను కొందరు స్వార్థపరులు తమకు అనుకూలంగా మలుచుకున్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. గత ప్రభుత్వ పాలనలో ఈ పోర్టల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కొన్ని ప్రైవేట్ ఏజెన్సీల భాగస్వామ్యం, అలాగే కీలకమైన రెవెన్యూ అధికారుల వ్యక్తిగత లాగిన్ ఐడీల దుర్వినియోగం వెనుక ఉన్న అసలు గుట్టును దర్యాప్తు బృందాలు బయటకు తీస్తున్నాయి. కేవలం ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుని, ప్రభుత్వ భూములను సైతం ప్రైవేట్ వ్యక్తుల పట్టాదారుల పేర్లతో మార్చడం, ఆ భూముల విస్తీర్ణాలను రికార్డుల్లో పెంచి చూపడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఎంతో పారదర్శకంగా భూపాలన సాగుతుందని గొప్పలు చెప్పిన మాజీ పాలకులు, తెరవెనుక జరిగిన ఈ భారీ దందాకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. డేటా ట్యాంపరింగ్ చేయడానికి

మిగతా 2లో..

## మెట్రో విస్తరణకు అనుమతులు ఇవ్వండి



- ఫేజ్-2 పనులు, ఫేజ్-1 స్వాధీనంపై సీఎం విజ్ఞప్తి
- ఎస్‌బీఐ క్యాప్స్ నియామకంలో జరుగుతున్న ఆలస్యంపై అసహనం
- జాప్యంతో ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదముందని హెచ్చరిక
- హైదరాబాద్ రవాణాకు ఫేజ్-2 అత్యంత కీలకం
- కేంద్ర మంత్రుల వ్యక్తిగత చొరవ కోరిన సీఎం
- ఉమ్మడి నిర్ణయాలను వెంటనే ఆచరణలో పెట్టాలని ఆకాంక్ష

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగర ప్రగతిలో కీలకమైన మెట్రో రైల్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం గట్టి దృష్టి సారించింది. ఫేజ్ II విస్తరణకు అవసరమైన అనుమతులు పొందడంలో వేగం పెంచాలని, ఫేజ్ I స్వాధీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేక లేఖలు పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ భవిష్యత్తు రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని

మిగతా 2లో..

## అంత్యక్రియలకు అడ్డుపడ్డ కులం

- కులం పేరుతో అంత్యక్రియలు అడ్డుకున్న పెద్దలు
- స్మశానానికి తాళాలు వేసి, కుటుంబానికే ప్రవేశం నిరాకరణ
- 70 ఏళ్లుగా ఉన్నా, సొంత కులంగా గుర్తించకపోవడం దారుణం
- సభ్యత్వం, ఓటు హక్కు ఉన్నా అమానుషంగా వ్యవహరించారు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్ల ఆగ్రహం

03






## ఒక్కరికి కూడా కంటి సమస్యలు ఉండొద్దు

- ప్రతి మనిషికి కంటి సమస్యలు లేకుండా చేయించే బాధ్యత నాది
- ఇప్పటివరకు 2325 మందికి ఆపరేషన్ చేయించా
- కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

04


## రేవంత్ రెడ్డి తెలంగాణ శని!



- ప్రాజెక్టు నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది
- కన్నేపల్లి వద్ద నీరు వృథాగా పోతోంది, పంపింగ్ చేయాలి
- పంపింగ్ చేపట్టకుంటే, రైతులతో కలిసి మేమే చేస్తాం
- కేసీఆర్‌పై కోపంతోనే ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారు
- మేడిగడ్డ సమస్యను రాజకీయాల కోసం వాడుకుంటున్నారు
- వెంటనే మరమ్మతులు చేసి, నీటిని నిల్వ చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. కన్నేపల్లి పంప్ హౌజ్ వద్ద వృథాగా సముద్రం పాలవుతున్న గోదావరి జలాలను పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు శని అని, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రసాదమని ఆయన వ్యాఖ్యానించారు. తాము రాజకీయ ప్రయోజనాల కోసం రాలేదని, వృథాగా పోతున్న నీటిని ప్రజలకు చూపడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు తమను అడుగడుగునా అడ్డుకున్నప్పటికీ, రైతుల కోసం ఈ పోరాటం చేస్తున్నామని ఆయన తెలిపారు.

మిగతా 3లో..



## మా కాలేజీ కూల్చుతారా?

- ఒక్కటి కూలిస్తే వంద కడతాం" అని అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు
- సంస్థలను కాపాడుకోవడం తెలుసని, బెదిరింపులకు లొంగబోమని స్పష్టం
- చెరువు శిఖం, ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టారనే వివాదం
- కాలేజీలో కొంత భాగం అక్రమమని హైడ్రా గతంలోనే గుర్తించింది

03

## ఫాతిమా కాలేజీ కూల్చివేత ఖాయం

- గతంలో ఈ సంస్థ మిలిటెంట్లకు షెల్టర్ ఇచ్చిందని సంచలనం
- విద్యా ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా?
- కాంగ్రెస్ అండతోనే ఒవైసీ బ్రదర్స్ కోర్టులను బెదిరిస్తున్నారు
- ఇతర సంస్థలపై చర్యలు తీసుకుని, ఇక్కడ ఎందుకు మౌనం?
- తాము అధికారంలోకి వస్తే కాలేజీని కూల్చివేస్తాం

03



# రేవంత్ రెడ్డి తెలంగాణ శని!

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ ఉద్యమ సమయంలో నీటి కోసం పడిన కష్టాలను, ఆనాటి దయనీయ పరిస్థితులను ఆయన గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ హయాంలో మళ్లీ నాటి దుస్థితి ఎదురవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేసీఆర్పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన ఈ బృహత్తర ప్రాజెక్టును కేవలం నాలుగేళ్లలోనే పూర్తి చేసి నీళ్లు పారించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు దశాబ్దాల తరబడి కొనసాగుతున్నా పూర్తి కాలేదని, అందుకు భిన్నంగా కాళేశ్వరాన్ని రికార్డు సమయంలో నిర్మించామని ఆయన వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పేరుతో ప్రజలను దశాబ్దాల పాటు మభ్యపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. మూడు చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ తుమ్మిడి హట్టి ప్రాజెక్టును ఏనాడు పట్టించుకోలేదని ఆయన దుయ్యబట్టారు. కేసీఆర్పై ఉన్న రాజకీయ కక్షతో ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి రైతులకు శిక్ష వేస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాల కోసం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని ఆయన స్పష్టం చేశారు. కన్నేపల్లి పంప్ హౌజ్ వద్ద ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, పంపులు ఆన్ చేస్తే వారం రోజుల్లో ప్రాజెక్టులను నింపుకోవచ్చని కేటీఆర్ గణాంకాలతో సహా వివరించారు. కరెంటు, యూరియా, సన్నరకం వడ్లకు బోనస్ వంటి భారాన్ని తగ్గించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పంపింగ్ చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఎన్డీఎస్ఏ, ఎన్డీఏ సంస్థల పేరుతో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను పడావు పెట్టి నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ప్రాజెక్టుల పనితీరుపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు.



ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి పంపింగ్ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తామే స్వయంగా 50 నుంచి 60 వేల మంది రైతులతో వచ్చి పంప్ హౌజ్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు. రైతుల నీటి అవసరాలను తీర్చడంలో విఫలమైతే, వారం రోజుల పాటు ప్రాజెక్టుల బాధ్యతలను కేసీఆర్కు అప్పగించాలని ఆయన ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. వాతావరణ శాఖ గత మూడు నెలల నుంచి ఎలినినో ప్రభావం ఉంటుందని పదేపదే హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువును ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను నిర్లక్ష్యం చేయడం సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత వైఖరికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. సోయి లేకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తోందని ఆయన విమర్శించారు. 370 పిల్లర్లు ఉన్న ఈ భారీ ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్ల దగ్గర మాత్రమే కుంగుబాటు జరిగిందని, ఇది కూడా ఎన్నికల ముందు జరగడం వెనుక కుట్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ను బద్నాం చేయడమే లక్ష్యంగా రాజకీయ దురుద్దేశంతో ఈ ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులో లోపాలను సవరించి పునరుద్ధరించడానికి ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు వచ్చినప్పటికీ, ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుందో సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. కేవలం 400 కోట్ల రూపాయల వ్యయంతో కుంగిన బ్లాక్ను కొత్తగా నిర్మించవచ్చని, అటువంటిది 31 నెలలుగా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం ఆశ్చర్యకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు స్టోరేజ్ కెపాసిటీ కేవలం 16.4 టీఎంసీలు మాత్రమేనని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టు 141 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించామని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రా బార్డర్ వరకు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉందని ఆయన స్పష్టం చేశారు. వందేళ్ల పాటు తెలంగాణలో కరువు ఛాయలు లేకుండా చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. ప్రభుత్వం పనికిమాలిన ఆరోపణలు మానేసి, ప్రాజెక్టుల మరమ్మతులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనే తగిన గుణపాఠం చెబుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, మాలోత్ కవిత, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి హాజరయ్యారు. పుట్ట మధు, బాల్క సుమన్, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, తాటికొండ రాజయ్య, జీవన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, వొడితల సతీష్ కుమార్ పాల్గొన్నారు. దాసరి మనోహర్ రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఆరూరి రమేష్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. వేలాది మంది కార్యకర్తలు తరలిరావడంతో ప్రాజెక్టు ప్రాంతం బీఆర్ఎస్ నినాదాలతో హోరెత్తిపోయింది.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీనత వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి జారుకుంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎక్కడా నీటి ఎద్దడి లేదని, మళ్ళీ ఇప్పుడు పాత రోజులు దాపురించాయని రైతులు ఆవేదన చెందుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం రాజకీయ కక్షలను పక్కనపెట్టి, రైతుల ప్రయోజనాలే పరమావధిగా పని చేయాలని ఆయన హితవు పలికారు. ప్రాజెక్టుల నిర్వహణలో అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవాలని, లేనిపక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. రైతుల కోసం ఏ పోరాటానికి అయినా సిద్ధమని, తాము చేస్తున్న ఈ ఆందోళనలు రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని ఆయన మరొక్కసారి పునరుద్ఘాటించారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పర్యటన ఒక కీలక మలుపుగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచే వ్యూహంలో ఉందని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రాజెక్టు లోపాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెబుతున్న నేపథ్యంలో, ఈ అంశంపై భవిష్యత్తులో మరింత రచ్చ జరిగే అవకాశం ఉంది. ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పలేదని విమర్శలు వస్తున్న తరుణంలో, కేటీఆర్ ఆందోళనలు ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతున్నాయి. రైతులకు నీరు అందే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ స్పష్టం చేయడంతో, రాబోయే రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం కానున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ ప్రధాన ఉద్దేశమని కేటీఆర్ ప్రకటించారు. ప్రజాక్షేత్రంలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమాన్ని చూడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# అంత్యక్రియలకు అడ్డుపడ్డ కులం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సిద్ధిపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ అమానవీయ ఘటన సమాజంలోని కుల వివక్షకు పరాకాష్టగా నిలిచింది. మనిషి ప్రాణం పోయాక కూడా కులమతాల రంగు పులమడం అత్యంత దురదృష్టకరమని మేధావులు మండిపడుతున్నారు. దశాబ్దాలుగా ఒక ప్రాంతంలో జీవిస్తున్నప్పటికీ, చనిపోయిన తర్వాత కనీసం దహన సంస్కారాలకు కూడా నోచుకోకపోవడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని చెప్పాలి. సిద్ధిపేట నగరంలోని ఆ కుటుంబం గత డెబ్బై ఏళ్లుగా ఇదే పట్టణంలో నివాసం ఉంటూ, స్థానికులతో కలిసిమెలిసి జీవించింది. అటువంటి కుటుంబంపై కుల దురహంకారులు ప్రదర్శించిన వైఖరి సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. ప్రాణం పోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేసే సమయంలోనే ఇటువంటి ఆటంకాలు సృష్టించడం క్రూరమైన చర్య అని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఈ కేసును నమోదు చేయడం జరిగిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. సమాజంలో మనుషుల మధ్య ఉన్న ఈ అడ్డుగోడలు ఎప్పటికి తొలగిపోతాయో అన్న ప్రశ్న




ఇప్పుడు ప్రతి ఒక్కరి మదిలో మెదులుతోంది. ఇటువంటి అమానవీయ సంఘటనల పట్ల చట్టం కఠినంగా వ్యవహరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు బలంగా కోరుతున్నారు. మరణించిన వృద్ధుడి కుటుంబ సభ్యులు గత డెబ్బై ఏళ్లుగా సిద్ధిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తూ, స్థానిక ఆచార వ్యవహారాలకు అనుగుణంగానే మసులుకుంటున్నారు. చనిపోయిన వ్యక్తి ఆ ప్రాంతంలో అందరితో స్నేహపూర్వకంగా ఉండేవారని, అటువంటి వ్యక్తికి దహన సంస్కారాలు జరపకూడదని కుల పెద్దలు అడ్డుకోవడం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. మనిషి తుది మజిలీలో కూడా కులం పేరుతో అడ్డుకోవడం ఏమిటని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆ కుల సంఘంలో సభ్యత్వం ఉండటమే కాకుండా, ఓటు హక్కు కూడా ఉందని వారు స్పష్టం చేస్తున్నారు. ఇంతటి ఆధారాలు ఉన్నప్పటికీ, కులపెద్దలు తమ అహంకారాన్ని ప్రదర్శిస్తూ స్మశాన వాటిక గేటుకు తాళాలు వేసి వెళ్ళిపోవడం దారుణమైన విషయమని చెప్పక తప్పదు. తీవ్ర దుఃఖంలో ఉన్న సమయంలోనే ఇటువంటి కష్టాలు ఎదురుకావడంతో ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. సామాజిక ఆంక్షల పేరుతో పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న వారిపై ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని బాధితులు పోలీసు అధికారులను వేడుకుంటున్నారు. మానవత్వంకంటే కులమే గొప్పదా అనే ప్రశ్న తలెత్తుతోంది. శనివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూసిన ఆ వృద్ధుడికి అంత్యక్రియలు జరిపేందుకు బంధువులు సిద్ధమయ్యారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని స్మశాన వాటికకు తరలించగా, అక్కడికి చేరుకున్న కుల పెద్దలు అడ్డుతగిలారు. ఈ కుటుంబం తమ కులానికి చెందిన వారు కారని వాదించిన సదరు పెద్దలు, గేటుకు తాళం వేసి వెళ్ళిపోవడం గమనార్హం. స్మశాన వాటిక ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ, కొన్ని వర్గాల పెత్తనం కొనసాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడే దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్న తమను, కుల సంఘ సభ్యులను కూడా బయటి వ్యక్తులుగా చూడటంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహం స్మశాన వాటిక ముందే పడి ఉండటంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసే పరిస్థితి వస్తుందని ఊహించని బాధితులు, చివరికి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. అధికారులు రంగంలోకి దిగి తాళాలను తెరిపించే వరకు ఆ కుటుంబం మృతదేహంతో రోడ్డుపైనే వేచి ఉండటం సిగ్గుచేటని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సమాజంలోని మార్పు కోసం ఇటువంటి ఘటనల పట్ల కఠినమైన శిక్షలు ఉండాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై రంగంలోకి దిగి కేసు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్మశాన వాటిక వద్దకు చేరుకున్న పోలీసులు, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. కుల పెద్దల తీరుపై పోలీసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్మశాన వాటిక అందరికీ చెందినదని, ఎవరూ దాన్ని ఆక్రమించుకోకూడదని స్పష్టం చేశారు. పోలీసుల జోక్యంతో చివరకు అంత్యక్రియలు పూర్తయినప్పటికీ, ఆ కుటుంబం అనుభవించిన వేదన వర్ణనాతీతం. మరణం తర్వాత జరిగే కర్మకాండలను అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని వదిలిపెట్టేది లేదని అధికారులు హెచ్చరించారు.

# ఫాతిమా కాలేజీ కూల్చివేత ఖాయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలోని ఫాతిమా విద్యాసంస్థల వివాదం ఇప్పుడు రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒవైసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ విద్యాసంస్థ గతంలో మిలిటెంట్లకు ఆశ్రయం ఇచ్చిందనే అంశాన్ని ఆయన తెరపైకి తెచ్చారు. చదువు చెప్పే ముసుగులో అక్కడ మిలిటెంట్లను తయారు చేస్తున్నారా అని బండి సంజయ్ తీవ్ర అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి విద్యాసంస్థలు నడుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండదండలతోనే ఒవైసీ సోదరులు బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. దేశంలోని చట్టాలు, న్యాయస్థానాలు తమకు ఏమీ చేయలేవనే అహంకారంతో వారు వ్యవహరిస్తున్నారని బండి ధ్వజమెత్తారు. ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని బండి తీవ్రంగా విమర్శిస్తున్నారు. హైకోర్టును సైతం బెదిరించేలా అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు ఉండటం అత్యంత దారుణమని బండి సంజయ్ అన్నారు. ఎంఐఎం నేతలకు కోర్టులన్నా, చట్టాలన్నా ఏమాత్రం గౌరవం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాల నిర్ణయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. కానీ, ఒవైసీ సోదరులు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తూ ఇతరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బండి ఆరోపించారు. ఫాతిమా విద్యాసంస్థల అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని నిలదీశారు. విద్యాసంస్థల అనుమతులపై సాగుతున్న ఈ వివాదంలో ప్రభుత్వ వైఖరి అనుమానాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఐఎం నేతల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. ఇటువంటి తీరు వల్ల సామాన్య ప్రజలకు న్యాయం జరగదని



బండి సంజయ్ స్పష్టం చేశారు. గండిపేట ఎఫ్టీఎల్ పరిధిలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అయితే, ఫాతిమా విద్యాసంస్థల విషయంలో మాత్రం ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒవైసీకి ఒక న్యాయం, ఇతరులకు ఒక న్యాయమా అని ఆయన నిలదీశారు. ప్రభుత్వ తీరులో స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి, ఎంఐఎంకు మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాల వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని బండి విమర్శించారు. ఆక్రమణల విషయంలో ఎవరికీ మినహాయింపులు ఇవ్వకూడదని ఆయన సూచించారు. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురైతే నగరానికి ముప్పు పొంచి ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నా, ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోంది. ప్రభుత్వ భూములను కాపాడటంలో వైఫల్యం చెందిన నేతలు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంలో ఎటువంటి జాప్యం చేయకూడదని ఆయన డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫాతిమా కాలేజీని కూల్చివేస్తామని బండి సంజయ్ సంచలన ప్రకటన చేశారు. చట్ట వ్యతిరేకమైన ఏ కట్టడాన్ని కూడా తాము వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులను కబ్జా చేసి విద్యాసంస్థల పేరుతో వ్యాపారం చేయడం సరికాదని బండి హితవు పలికారు. అధికారంలోకి రాగానే అక్రమార్కుల పీచమణుస్తామని ఆయన హెచ్చరించారు. బీజేపీ సిద్ధాంతం ప్రకారం చట్టం అందరికీ సమానం, ఎవరూ చట్టానికి అతీతులు కారని ఆయన నొక్కి చెప్పారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఫాతిమా కాలేజీ అక్రమ కట్టడమని ఇప్పటికే హైడ్రా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అటువంటి సంస్థలను కాపాడేందుకు రాజకీయ నేతలు ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇటువంటి అక్రమాలను ప్రోత్సహించడం తగదని ఆయన గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం తొత్తుగా మారిందని బండి సంజయ్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ఎంఐఎం ప్రమేయం ఉంటుందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి ఓటు బ్యాంక్ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని బండి మండిపడ్డారు. ఫాతిమా కాలేజీ వివాదం రాజకీయ రంగు పులుముకోవడంతో గందరగోళం పెరుగుతోంది. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండానే అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కానీ, రాజకీయ నేతలు మాత్రం తమ ప్రయోజనాల కోసం విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, రాజకీయ నేతలు అడ్డుపడటం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా తప్పించుకోలేరని బండి సంజయ్ అన్నారు. ప్రజల మద్దతుతో అక్రమాలను అంతం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అక్బరుద్దీన్ వ్యాఖ్యలు సమాజంలో అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, చట్టాన్ని గౌరవించకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం విచారకరం. శాంతి భద్రతలను కాపాడాల్సిన వారే అశాంతికి దారితీసేలా మాట్లాడుతుంటే, పోలీసులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు.

# మూడు బ్యారేజీలు రిపేర్ చేస్తం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ సెక్రటేరియట్ వేదికగా సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల మరమ్మతులను 2027 జూలై నాటికి పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు వైఫల్యానికి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆయన ఆరోపించారు. నిర్మాణాలు నాసిరకంగా ఉండటం వల్లే నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. ఐఐటీ బాంబే నిపుణుల బృందం సమర్పించే తుది నివేదిక కోసం ప్రభుత్వం వేచి చూస్తోంది. నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి కార్యాచరణ ఉంటుందని చెప్పారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టును పర్యవేక్షించే అధికారులు సకాలంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులపై ఆయన సమగ్రమైన వివరణ ఇస్తూ బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రాజెక్టు డిజైన్ లోపాలను మంత్రి ఎత్తిచూపారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని పేర్కొన్నారు. రాజకీయ కక్షల వల్ల డిజైన్ మార్చడం వల్లనే ఈ విపత్తు ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఫౌండేషన్ లోపభూయిష్టంగా ఉందని జాతీయ స్థాయి నిపుణులు తేల్చారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని నిల్వ చేస్తే భద్రాచలం, 44 గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అటువంటి విపత్కర స్థితిని దృష్టిలో ఉంచుకునే తాము నీటి నిల్వకు అనుమతించడం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు కమీషన్ల కోసం ప్రాజెక్టును నాశనం చేశారని ఆయన ఆరోపణలు చేశారు. పదేళ్ల కాలంలో నీటి పారుదల శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసి రైతులకు నీరందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. కేటీఆర్ చేస్తున్న ఆరోపణలను మంత్రి ఉత్తమ్ తీవ్రంగా తిప్పికొట్టారు. కన్నెపల్లి పంపుహౌస్ వద్ద కేటీఆర్ చేస్తున్న పనులను



ఆయన నాటకాలుగా అభివర్ణించారు. ఉల్టా చోర్ కొత్వాల్ కో దండే అన్నట్లుగా బీఆర్ఎస్ నాయకుల తీరు ఉందని ఎద్దేవా చేశారు. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రాణహిత నీటిని పంపు చేయాలని కోరడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. బ్యారేజీలు కూలిపోయిన స్థితిలో ఉన్నప్పుడు నీటిని ఎలా తరలిస్తారని ఆయన ప్రశ్నించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేతలు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో లక్షా ఎనభై ఒక్క వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినప్పటికీ సరైన ఆయకట్టు సాగులోకి రాలేదని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడిన వారికి విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. తుమ్మిడిహెట్టి, ఎల్లంపల్లి ప్రాజెక్టుల విషయంలో పరస్పర అవగాహనతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. గ్రావిటీ ద్వారా ఎనభై టీఎంసీల నీటిని తరలించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, నెల రోజుల్లో కొత్తగా పనులు మొదలవుతాయని ప్రకటించారు. ఎల్నినో ప్రభావం ప్రపంచవ్యాప్త సమస్య అని, తెలంగాణపై దాని ప్రభావం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. విపత్తులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. నీటి నిల్వకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ అధికారుల సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. నిపుణుల సూచనల మేరకే డయాఫ్రమ్ వాల్ వంటి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామని వివరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. పారదర్శకమైన పాలన ద్వారా అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేస్తామని మంత్రి హెచ్చరించారు. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పదేళ్ల కాలంలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాసిరకమైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని ఆరోపించారు. నాణ్యత లేని నిర్మాణాల వల్లే నేడు ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. కేటీఆర్ ప్రాజెక్టుల వద్ద సందర్శనలు చేయడం ద్వారా ప్రజలను మభ్యపెట్టలేరని స్పష్టం చేశారు. నిజాలను నిగ్గు తేల్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలోని లోపాలను సరిదిద్దేందుకు నిపుణులను రంగంలోకి దించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటి శాఖలో అద్భుతమైన మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రాజెక్టుల మరమ్మతులతో పాటు భవిష్యత్తులో సాగునీటి కష్టాలు రాకుండా శాశ్వత పరిష్కారాలు చూపుతామని మంత్రి భరోసా ఇచ్చారు. నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన తెలిపారు. నీటి పారుదల శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు. సమర్థులైన ఇంజనీర్లతో పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర రైతాంగం కోసం వినియోగించేలా తీర్చిదిద్దుతామన్నారు. ప్రాజెక్టు నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సాంకేతిక పరమైన సవాళ్లను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఐఐటీ బాంబే నివేదికలో వచ్చే అంశాల ఆధారంగా భవిష్యత్తు ప్రణాళికలు ఉంటాయని పునరుద్ఘాటించారు. రైతులకు సాగునీరు అందించడం తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ ఎన్ని నాటకాలు ఆడినా వాస్తవాలు మారవని ఎద్దేవా చేశారు.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

# మా కాలేజీ కూల్చుతారా?

హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ ప్రాంతంలో వెలిసిన ఫాతిమా విద్యాసంస్థల భవనాల చుట్టూ అలుముకున్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. సల్కం చెరువు శిఖం భూములను ఆక్రమించి ఈ కళాశాల నిర్మించారనేది ప్రధానమైన ఆరోపణగా నిలిచింది. ప్రభుత్వ భూములను, నీటి వనరుల పరిధిలోని స్థలాలను అక్రమంగా కబ్జా చేశారని స్థానికులు గట్టిగా వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నిర్వహించిన అనంతరం కాలేజీలో కొంత భాగం చెరువు శిఖం పరిధిలోకి వస్తుందని నివేదిక ఇచ్చారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా భవనాలను నిర్మించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని భావిస్తున్న తరుణంలో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది. విద్యాసంస్థల పేరుతో భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అక్రమ కట్టడాల కూల్చివేత అంశం ప్రస్తుతం నగరంలో హాట్ టాపిక్గా మారింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన చిక్కుముడులు వీడాలంటే పూర్తిస్థాయి విచారణ తప్పనిసరి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఫాతిమా విద్యాసంస్థల అనుమతులపై దాఖలైన పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే సంచలన విషయాలను బయటపెట్టింది. కళాశాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని సదరు శాఖ స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. దీనిపై విచారణ సందర్భంగా జడ్జి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తోంది. కాలేజీ భవనాలకు జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకున్నారా అని జడ్జి సూటిగా ప్రశ్నించగా ప్రభుత్వ తరఫున సరైన స్పందన రాలేదు. నిబంధనలను తుంగలో తొక్కి ఎలా నిర్మాణాలు చేపట్టారని న్యాయస్థానం నిలదీసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి వారంలోపు గడువు విధించింది. చట్టం ముందు అందరూ సమానమేనని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అప్పట్లో కూల్చివేతలకు దూరంగా ఉన్నామని అధికారులు పేర్కొంటున్నారు. కానీ నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తుందని పిటిషనర్ వర్గాలు వాదిస్తున్నాయి. న్యాయస్థానం తీర్పుపై అందరి దృష్టి నెలకొంది. ఈ వివాదంపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. కాలేజీ కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులను గతంలోనే చాలా చూశామని, భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ విద్యాసంస్థలను ఎలా కాపాడుకోవాలో బాగా తెలుసని ధీమా వ్యక్తం చేశారు. ఒక్క కాలేజీని కూల్చివేస్తే దానికి బదులుగా వంద కళాశాలలను నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు. ఎవరికీ లొంగేది లేదని, విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కల్పించవద్దని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ అజెండాతోనే తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని ఆయన ప్రకటన రాజకీయంగా దుమారం రేపుతోంది. తమ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా సంస్థ దూకుడుగా వ్యవహరిస్తోంది. చెరువులు, నాలాల ఆక్రమణలను అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొంటున్నారు. సల్కం చెరువు ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులను తాము సీరియస్గా తీసుకున్నామని వెల్లడించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫాతిమా కాలేజీకి సంబంధించి ఇప్పటికే ప్రాథమిక ఆధారాలు లభించాయని, వాటిని కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. రాజకీయ నాయకుల జోక్యం ఉన్నప్పటికీ చట్టాన్ని అమలు చేయడంలో వెనక్కి తగ్గేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా పోతిరెడ్డి నిశ్చితార్థ వేడుక

- ఎమ్మెల్యే పాయం, ఎంపీ బలరాం నాయక్ హాజర్
- భారీగా తరలివచ్చిన బంధు మిత్రులు, అభిమానులు



**బూర్గంపాడు / విశాలభారతి:** పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యవతి లక్ష్మీపురం తన కుమారుని నిశ్చితార్థ వేడుక అక్షయ ఫంక్షన్ హాల్ భద్రాచలం నందు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నిశ్చితార్థం వేడుకతో రెండు కుటుంబాలు ఒక్కటయ్యాయి. దీంతో రెండు కుటుంబాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీ పోరిక బలరాం నాయక్ హాజరై నూతన వధూవరులను చెన్నకేశవరెడ్డిని , స్రవంతిలను ఆశీర్వదించారు. వీరితోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, అభిమానులు అధిక సంఖ్యలో విచ్చేసి కాబోయే నూతన వధివరులను దీవించారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యవతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాధితునికి ఎల్ ఓ సి చెక్కు మంజూరు

- చెక్కును అందజేసిన గౌరి శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్



**చౌటుప్పల్, విశాలభారతి;** మండలంలోని నాగారం గ్రామంలో గత కొన్ని రోజులుగా పాక బాలయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో 5,00,000 రూ రూపాయల చెక్కును మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా 5,00,000 రూపాయల ఎల్ఓసి చెక్కును ఆ గ్రామ సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ బాధితులైన అయినా పాక బాలయ్యకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మైసయ్య, వార్డు సభ్యులు రమేష్ దోనూరి కిరణ్ రెడ్డి,పాక రాము,సీనియర్ నాయకులు రాసాల జంగయ్య,బొంగు సాయికుమార్, రాములు,శ్రీశైలం,భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో తరలిస్తున్న గుడుంబా పట్టివేత




**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి అధికారుల ఉత్తర్వు మేరకు పేరూరు ఎస్ఐ జీ. కృష్ణప్రసాద్ తన సిబ్బందితో టేకులగూడెం గ్రామ శివారులో NH163 రోడ్డు పైన వాహనాలు తనిఖీ చేయు చుండగా ఛత్తీస్ ఘడ్ వైపు నుండి టేకులగూడెం వైపు వస్తున్న CG17KS7002 బస్సు మమ్ములను చూసి కొంత దూరములో ఆపి అనుమాన స్పదంగా కనబడడముతో వెంటనే SI కృష్ణప్రసాద్ తన సిబ్బందితో బస్సు వద్దకు వెళ్లి బస్సులో తనిఖీ చేయగా బస్సు డిక్కీలో మూడు బస్తాలలో ప్యాక్ చేసి ప్రభుత్వం నిషేధించబడిన గుడుంబా పరిశీలించి చూడగా 210 లీటర్లు కలదు, ఇట్టి గుడాంబే విలువ సుమారు 84,000 గా కలదు, ఇట్టి నిషేధిత గుడంబాను ఛత్తీస్ ఘడ్ నుండి 1. జనగామ రమణ w/o వెంకటి , 43 సంllలు , కులం : నేతకాని నిll ధర్మారం 2. కావేరి జయ w/o సమ్మయ్య, 37 Yrs, ని. అయ్యవారి పేట అను వారు నెంబరు గల బస్సు డ్రైవర్ ఉమేష్ కుమార్ యాదవ్ మరియు క్లినర్ రమేష్ గౌడ్ ల సహాయముతో తరలిస్తున్నారని తెలిసింది. ఈ సందర్భంగా పేరూరు SI G. కృష్ణప్రసాద్.. మాట్లాడుతూ గుడుంబా తయారు చేసిన. లేదా దాన్ని రవాణా చేసిన వారు ఎవ్వరిని వొదిలే ప్రసక్తి లేదని చట్ట పరంగా చర్యలు కటినంగా ఉంటాయి అక్రమ కార్య కలపాలకు పాల్పడ వద్దని హెచ్చరించారు. గుడంబాను తరలిస్తున్న వారికి సహకరించిన వ్యక్తుల పై కేసు నమోదు చేసుకొని బస్సు తో పాటు గుడుంబని స్వాధీన పరుచుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పోజిగూడలో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం

- ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు




**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు అప్పోజిగూడలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ కల్లెంల జగపతి ఆధ్వర్యంలో యువకులు గ్రామస్థులకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను స్వచ్ఛందంగా నింపి అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కల్లెంల జగపతి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సులభంగా ప్రజలకు చేరవేస్తాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ఓటర్లు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేందుకు అవసరమైన సహాయాన్ని అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు తలుగుల వినీత్, నాయకులు శ్రవణ్, ఆల్వాల్ రెడ్డి, లక్ష్మణ్, జంగయ్య, కుమార్, సురేష్, రవీందర్, హరీష్, మాణిక్యం, గ్రామస్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి – ప్రజా సంక్షేమమే ఎజెండా

- ప్రముఖ నాయకులతో భేటీ అయిన బసవరాజ్ శ్రీనివాస్..
- పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ






**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సానుకూలంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజా సేవలో మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించగా, వారి ఆశీస్సులు, మార్గదర్శకత్వం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని బసవరాజ్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తనకు ఎంతో ప్రేరణనిస్తాయని బసవరాజ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక సంక్షేమం, ప్రజా సేవా కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ఎజెండా అని, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా మరింత బాధ్యతతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని బసవరాజ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ఒక్కరికి కూడా కంటి సమస్యలు ఉండొద్దు

- ప్రతి మనిషికి కంటి సమస్యలు లేకుండా చేయించే బాధ్యత నాది
- ఇప్పటివరకు 2325 మందికి ఆపరేషన్ చేయించా
- కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి







**చౌటుప్పల్, విశాలభారతి:** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దని,ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించే బాధ్యత నాదని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు ఆయన శ్రీకారం చుట్టారు.దాంట్లో భాగంగానే 15వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చౌటుప్పల్ మండల,మున్సిపాలిటీ ప్రజలకు కలిపి చౌటుప్పల్ లో నిర్వహించారు.ఈ 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 10444 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2325 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి 4557 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన పదో విడత వైద్య శిబిరంలో 160 మందికి కంటి వైద్య పరీక్ష నిర్వహించామని తెలిపారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు. దాంట్లో భాగంగానే ఆదివారం నాడు 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈవైద్య శిబిరంలో 1210 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 208 కి పైగా ఆపరేషన్లకు ఎంపికయ్యారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో,ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరంతర ప్రక్రియగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## కాంగ్రెస్–బీఆర్ఎస్–బీజేపీకి వరుస షాక్‌లు..!




- టీఆర్ఎస్ వైపు యువత
- మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు, గ్రామ పెద్దలు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఇచ్చోడ మండల కేంద్రంతో పాటు మండలంలోని గుండాల గ్రామానికి చెందిన సుమారు 40 మంది యువకులు, గ్రామ పెద్దలు పార్టీలో చేరగా, ఇచ్చోడ ఇస్లాంపుర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త షేక్ కలీం ఆధ్వర్యంలో మరో 60 మంది తెలంగాణ రక్షణ సేనలో సభ్యత్వం స్వీకరించారు. పార్టీలో చేరిన వారందరికీ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరుతున్న యువతను అభినందిస్తూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లో చైతన్యంతో ముందుకు రావడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడే పార్టీగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ షేక్ బిలాల్, షేక్ పరీద్, మరుతీ పటేల్, ముస్తాపా, మొహమ్మద్, నవాజ్ ఖాన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.ఈ సభ్యత్వ కార్యక్రమంతో బోథ్ నియోజకవర్గ పరిధిలో తెలంగాణ రక్షణ సేన పార్టీ గ్రామీణ స్థాయిలో మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జులై 11వరకు జిల్లా వ్యాప్తంగా నాగన్న సంతాప సభలు నిర్వహించండి



- ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య

**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:** ఎమర్జెన్సీ చీకట్లను చీల్చుకుంటూ సైరన్ మోతై ప్రజలను మేల్కొల్పుతూ ప్రారంభమైన నాగన్న పాట నేడు ఆగిపోయిందని, ఎమర్జెన్సీ కాలంలో రాజ్యం బూటకపు ఎన్కౌంటర్ కు బలైన శ్రీపాద శ్రీహరి జన్మస్థలమైన రాజారంలో పుట్టిన నాగన్న ఆయన వారసత్వాన్ని స్వీకరించి ఎమర్జెన్సీ ముగిసిన వెంటనే కంజర పట్టుకొని, కాలుకు గజ్జ కట్టుకొని ఉద్యమ గానమై ఊరూరు తిరిగిన నాగన్న పాట ప్రజలను దోపిడీ అణచివేతలపై తిరుగుబాటుకు పురిగొల్పిందని సీపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు మహబూబాబాద్ పార్టీ కార్యాలయంలో నాగన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఐలయ్య ప్రసంగిస్తూ నాగన్న 50 ఏళ్ల తన విప్లవ సాంస్కృతిక ప్రస్థానంలో నాగన్న ఉన్నత శిఖరాలను అందుకున్నాడని, నేడు నాగన్న అనే పేరు ఉద్యమ పాటకు మారుపేరుగా నిలిచిందదని అన్నారు.నాగన్న ప్రాణం కోల్పోయినా ఆయన పాట శాశ్వతంగా మనమధ్య నిలిచి వుంటుందని అన్నారు. కమ్యూనిస్టు కవులకు కళాకారులకు నాగన్న ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. ఈనెల 11 వరకు జిల్లాలో గ్రామ గ్రామాన నాగన్న సంతాపసభలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ సభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఇడంపాక శ్రీశైలం ప్రసంగిస్తూ నాగన్న ఉక్కు క్రమశిక్షణ కలిగిన నిస్వార్థ ప్రజా కళాకారుడని, ప్రభుత్వ పథకాలను, పాలకుల ప్రలోభాలను తిరస్కరించి నికార్సయిన సాంస్కృతిక యోధుడిగా నిలిచాడని అన్నారు.అరుణోదయ ఆవిర్భావం నుండి తుది శ్వాస దాకా విప్లవ కళా రంగ సైనికుడిగా 5 దశాబ్దాల పాటు విశేష కృషి చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ళ మురళీకృష్ణ,జడ సత్యనారాయణ,మైల యాకన్న, ఊడుగుల లింగయ్య,చిర్ర యాకన్న, గజ్జి లింగన్న,యస్కే బాబు, బట్టు చైతన్య,బోనగిరి మధు, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బాకారం జాగీర్‌లో హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- దశలవారీగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం.
- సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్



**మొయినాబాద్, జూలై 5(విశలభారతి):** మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో హెచ్ఎండీఏ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్గని వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాన్ని దశలవారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహకారంతో బాకారం జాగీర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు బంది అనిల్, ఉపేందర్ యాదవ్, కొండకల్ల రవి, మడి దినేశ్ రెడ్డి, బిక్షపతి గౌడ్, కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత బస్తి సమస్యల పరిష్కారానికి కృషి

- బాగ్ హయత్‌నగర్ స్మశానవాటికను పరిశీలించిన గజ్జి భాస్కర్ యాదవ్ – మౌలిక వసతుల కల్పనకు హామీ



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఆదివారం బాగ్ హయత్‌నగర్ గ్రామంలోని దళిత బస్తిని సందర్శించారు. దళిత బస్తి వాసుల విజ్ఞప్తి మేరకు అక్కడి స్మశానవాటికను పరిశీలించిన ఆయన, స్థానికులతో కలిసి పరిస్థితులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్మశానవాటికలో రహదారి, ప్రహరీ గోడ, విద్యుత్, నీటి సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించాలని దళిత బస్తి వాసులు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను ఓర్పుగా విన్న గజ్జి భాస్కర్ యాదవ్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్మశానవాటికలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, ప్రతి వర్గం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత పారంద స్వామి, దళిత సంక్షేమ సంఘం నాయకులు, బస్తి పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

- ఒడిసి, భరతనాట్యంతో ఆకట్టుకున్న కళాకారులు



**సైబరాబాద్ విశాల భారతి;** మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ఆహ్లాదంగా సాగాయి. కోల్‌కతా నుంచి విచ్చేసిన ఒడిసి కళాకారుడు సబార్నిక్ దే మంగళాచరన్, హంసధ్వని పల్లవి, జయదేవ అభినయ, మోక్ష అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించాడు.అనంతరం సంతోష్ కుమార్ తమంగ్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతి కౌతం, సరస్వతి శబ్దం, నాతనం ఆదినార్, ఆనంద నాతనం ప్రకాశం, దేవి కీర్తనం, చంద్రముఖలె, జావళి అంశాలను దివ్య నితిన్, భావన, హరిణి, హర్షిత, లక్ష్మి కార్తీక్, మౌనిక, యోహాన, ఉర్విజ, సౌమ్య, సోమా, రుచిత కళాకారులు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమానికి సందర్శకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుకు గాయం

- పరామర్శించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా



**సైబరాబాద్ విశాల భారతి;** కేటీఆర్ కన్నెపల్లి పర్యటనలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఛాతికి బలమైన గాయమైంది. ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆయన ప్రస్తుతం నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శంబీపూర్ రాజు నివాసానికి వెళ్లి పరామర్శించారు. రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు సూచించిన విశ్రాంతి తీసుకుంటూ, సూచనలు పాటిస్తున్నట్లు రాజు సాయిబాబాకు వివరించారు.కన్నెపల్లి పర్యటనలో జరిగిన ఈ ఘటనపై నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. శంబీపూర్ రాజు త్వరగా కోలుకుని ప్రజా సేవలో మళ్లీ పాల్గొనాలని సాయిబాబా ఆకాంక్షించారు. ఈ పరామర్శలో పలువురు స్థానిక నేతలు కూడా పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ

- జెండా ఆవిష్కరించిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్
- హాజరైన నవీన్ ఆచారి, నేతలు, కార్యకర్తలు

**సైబరాబాద్ విశాల భారతి;** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జెండా పండుగ' కార్యక్రమం శేరిలింగంపల్లిలో ఘనంగా జరిగింది. లింగంపల్లి రైతుబజార్ వద్ద వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఆర్ఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ ప్రసాద్ జెండా ఎగురవేసి కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ స్టేట్ జనరల్ సెక్రటరీ నవీన్ ఆచారి, వాసిలి నివేదిత, నరేష్, కిషోర్, లావణ్య బండారి, విష్ణు చారీ, కవిత, మాధవి, కుమార్ యాదవ్, సందీప్, షేక్ అస్లాం, ప్రవీణ్‌తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం జై తెలంగాణ నినాదాలతో సందడిగా సాగింది. అనంతరం చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ, కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. జెండా పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## బౌద్ధ నగర్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం



**సికింద్రాబాద్ విశాలభారతి :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం బౌద్ధనగర్ డివిజన్లో జరుగుతుంది. ఆదివారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీ ఆర్ఎస్ పార్టీ నాయకుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవాలన్నారు.

## చిన్నారులకు స్కై ఫౌండేషన్ ఆసరా



సికింద్రాబాద్, విశాలభారతి : రోడ్ల పక్కన తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ, చదువుకు దూరమవుతున్న సంచారజాతుల కుటుంబాల చిన్నారులకు అండగా నిలిచేందుకు స్కై ఫౌండేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. వారి సంకల్పంలో భాగంగా ఆదివారం నాడు ఆయా కుటుంబాల చిన్నారులకు పలకలు, బలపాలు, ఆట వస్తువులతో పాటు పలు రకాల తినుబండారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు స్వయంగా ఆ చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. నిరుపేద బాలల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, ప్రతి ఒక్కరికీ చదువుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. పలకలు, ఆట వస్తువులను అందుకున్న చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు విరబూశాయి. ఈ సేవా కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వై. సంజీవ కుమార్, ఉపాధ్యక్షులు ఓ. పావని తదితరులు పాల్గొన్నారు.

## మంద జగన్ కు సన్మానం



**సికింద్రాబాద్, విశాల భారతి :** ప్రముఖ సామాజిక సేవకుడు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్ కి ఘన సన్మానం నిర్వహించారు.లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జగన్ ని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.అనంతరం చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వారి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించారు. సమాజ సేవలో నిరంతరం ముందుండి సేవలందిస్తున్న జగన్ ని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## మహిళా ఆరోగ్య కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- **మహిళల ఫెర్టిలిటీ చికిత్సలకు 'హెర్‌స్పేస్' సేవలు ప్రారంభం**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మణికొండ పరిధిలోని నెక్నాంపూర్, అల్కాపూర్ టౌన్‌షిప్ (రోడ్ నెం. 24)లో నూతనంగా ఏర్పాటు చేసిన "హెర్‌స్పేస్" (హెర్‌స్పేస్ ఉమెన్స్ హెల్త్ & ఫర్టిలైటీ కేర్ ) మహిళా ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్లినిక్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఇలాంటి కేంద్రాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. మహిళల ఆరోగ్యం, సంతానలేమి (ఫెర్టిలిటీ) సమస్యలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కె. మాధవీ లత, ఇన్ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ ఉమా మహేశ్వరి కాసిరెడ్డి ఆధ్వర్యంలో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. మాధవీ లత మాట్లాడుతూ, మహిళలకు సమగ్ర ఆరోగ్య సేవలు ఒకే చోట అందించేలా ఈ కేంద్రాన్ని రూపొందించామని తెలిపారు. డాక్టర్ ఉమా మహేశ్వరి కాసిరెడ్డి మాట్లాడుతూ, ఫెర్టిలిటీ సమస్యలకు ఆధునిక చికిత్సలను అందిస్తూ దంపతులకు ఆశ నింపడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వైద్యులు, సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

- **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో బూత్ నెం. 208ను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నెం. 208ను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు పారదర్శకంగా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వో శ్రీరాములు, బీఎల్ఏ శ్రీకాంత్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా ఆర్ అండ్ బి రహదారి



**అశ్వాపురం, విశాల భారతి :** అశ్వాపురం నుండి కొత్తగూడెం వెళ్లే మార్గంలోని గొల్లగూడెం సమీప సీతారామ ప్రాజెక్టు కాలువ వంతెన దగ్గర నుండి సీతారామపురం గ్రామం వరకు రోడ్డంతా గుంతల మయంగా తయారై వాహనదారులకు తీవ్రమైన ఇబ్బంది కలుగుతుందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పాయం నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన చిరుజల్లులకే ఇక్కడ రహదారంతా దారిద్ర్యంగా తయారైందన్నారు. ఇక్కడ ఏర్పడిన గుంతల వలన తరచూ చిరువాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. పట్టించుకోవాల్సిన ఆర్ అండ్ బికి శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారుల నుండి పెద్ద ఎత్తున రోడ్ టాక్స్ లు వసూలు చేస్తూ వారికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించి ప్రమాదాలు జరగకుండా ఆ శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను ప్రత్యమ్నాయ పద్ధతుల ద్వారా పూర్తి చేసి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

# రూ.21 కోట్లతో కంసాన్‌పల్లి పశు ఘనీకృత వీర్య నాలికల ఉత్పత్తి కేంద్రం

- **త్వరలో పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తాం**
- **రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**
- **కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో రెండో కేంద్రంగా కంసాన్‌పల్లి**
- **ఏడాదికి 10 లక్షల మేలు జాతి పశువుల ఉత్పత్తికి కేంద్రం దోహదం**
- **పాల ఉత్పత్తిలో తెలంగాణను ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు**
- **కంసాన్‌పల్లి పశు ఘనీకృత వీర్య నాలికల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి శ్రీహరి**



**షాద్‌నగర్,(విశాల భారతి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాని పశువుల ఘనీకృత వీర్య నాలికల (ఫ్రోజన్ సీమెన్ స్ట్రా) ఉత్పత్తి కేంద్రాన్ని రూ.21 కోట్లతో పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక,మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తో కలిసి మంత్రి పశు వీర్య గణాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు కేంద్రం నిర్మాణం,అందుబాటులో ఉన్న సదుపాయాలు, లక్ష్యాలు,భవిష్యత్ కార్యాచరణను మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి స్థానిక మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి పశు ఘనీకృత వీర్య నాలికల ఉత్పత్తి కేంద్రం కంసాన్‌పల్లిలోనే ఉందని తెలిపారు.ఈ కేంద్రం పూర్తి స్థాయిలో ప్రారంభమైతే మేలు జాతి పశువుల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, రైతులకు అధిక పాల ఉత్పత్తి చేసే పశువులు అందుబాటులోకి వస్తాయని అన్నారు.ఇప్పటికే నిర్మాణం పూర్తయినా ఉపయోగంలోకి రాని ఈ కేంద్రాన్ని రూ.21 కోట్లతో అన్ని హంగులతో సన్నద్ధం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అవసరమైన సిబ్బంది నియామకం,మౌలిక వసతుల కల్పన,సాంకేతిక ఏర్పాట్లపై అధికారులు నివేదికలు సమర్పించిన వెంటనే కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.మాంసం,పాల విక్రయాల్లో తెలంగాణ మంచి పురోగతి సాధిస్తున్నప్పటికీ, పాల ఉత్పత్తిలో మాత్రం ఇంకా వెనుకబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో పాల ఉత్పత్తిలో తెలంగాణ 13వ స్థానంలో ఉందని, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కంసాన్‌పల్లి కేంద్రం అందులో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

**రూ.21 కోట్లతో కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రూ.21 కోట్లతో ఈ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అవసరమైన నిధులు, సిబ్బంది నియామకం, ఇతర ఏర్పాట్లపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించిన వెంటనే పనులు పూర్తి చేసి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కేంద్రం ద్వారా ఏడాదికి సుమారు 10 లక్షల మేలు జాతి పశువుల ఉత్పత్తికి అవసరమైన ఘనీభవించిన వీర్య నాలికలు తయారు చేసే సామర్థ్యం ఏర్పడుతుందని, దీంతో రైతులకు అధిక పాల ఉత్పత్తి చేసే మేలు జాతి పశువులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్బారాయుడు, పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వహణాధికారి, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ సింగం చరణ్ కౌశిక్ యాదవ్, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జ్ఞానప్రకాశ్, కంసాన్‌పల్లి సర్పంచ్ గీత, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశువైద్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రవణ్ కుమార్, ఈవో డాక్టర్ అరుణశ్రీ, స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, ఎమ్మార్వో నాగయ్య, స్థానిక నాయకుడు నరేందర్ రెడ్డి తదితరులున్నారు..

## రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి

- **తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు**

**ముషీరాబాద్, విశాలభారతి:** తెలంగాణ వ్యాప్తంగా విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ఆదివాసి ఎరుకలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు ఆవేదన వ్యక్తం చేశారు.1956 నుండి నేటి వరకు అభివృద్ధి చెందుతున్న లంబాడి, కోయ, గోదులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్న పాలకులు ఆదివాసి ఎరుకలను మాత్రం విస్మరిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆదివారం బంజారా హిల్స్ లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి ఎరుకల కులస్తులకు న్యాయం జరగాలంటే వెంటనే నేషనల్ ఎస్టీ కమిషన్ గైడ్లైన్స్ ప్రకారం రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు



చేసి ఆదివాసి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. మైదాన ప్రాంతంలో ఉన్న ఆదివాసి ఎరుకలకు విద్య ఉద్యోగం ఉపాధి రాజకీయ రంగాల్లో వెనుకబడిపోయి అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారని తెలిపారు. ఆదివాసి ఎరుకల కులస్తుల తరపున చట్టసభల్లో మాట్లాడే వారే లేకపోవడంతోనే సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలు అందడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలానే ఎరుకల ఎంపవర్మెంట్ స్కీమ్ జీవో నెంబర్ 59 కింద 60 కోట్ల నిధులు కేటాయించి పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. విద్యారంగంలో ఆదివాసి ఎరుకల విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ఒకే నంబర్ ప్లేట్.. మూడు బైక్‌లు

- **ఘరానా మోసం బయటపెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు**



**సికింద్రాబాద్, విశాలభారతి :** ట్రాఫిక్ చలానాలు, ఫైనాన్స్ కంపెనీల జప్తుల నుంచి తప్పించుకోవడానికి ఒకే నంబర్ ప్లేట్‌ను మూడు వేర్వేరు ద్విచక్ర వాహనాలకు వాడుతూ ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలను బురిడీ కొట్టిస్తున్న ముగ్గురు నిందితులను చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ తనిఖీల్లో నిందితుల నుంచి ఒకే రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉన్న మూడు హోండా యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పార్సిగుట్ట కమలా నెహ్రూ నగర్‌కు చెందిన లైటింగ్ వ్యాపారి మల్లికార్జున్ (28),వ్యాపారస్తుడు అజయ్ రెడ్డి (29), సంజీవాపురానికి చెందిన కలెక్షన్ ఏజెంట్ కొప్పుల ధనరాజ్ (30) ముగ్గురు స్నేహితులు, మల్లికార్జున్‌కు సాయి రామ్ అనే వ్యక్తి అప్పు బకాయి కింద ఫైనాన్స్ చేయబడిన, ఇంకా రిజిస్ట్రేషన్ కాని ఒక హోండా యాక్టివా వాహనాన్ని ఇచ్చాడు. అయితే ఈ వాహనంపై ఇండస్ ఇండ్ బ్యాంక్‌కు రూ. 36వేల లోన్ బకాయి ఉండటంతో, బ్యాంక్ అధికారులు ఎక్కడ సీజ్ చేస్తారోనని మల్లికార్జున్ ఒక ఉపాయం పన్నాడు. తన వద్ద ఉన్న అసలైన యాక్టివా వాహనం నంబర్ (TS09 FE 4997)తో నకిలీ నంబర్ ప్లేట్‌ను తయారు చేయించి, ఆ ఫైనాన్స్ వాహనానికి తగిలించి అజయ్ రెడ్డికి ఇచ్చాడు. ఈ క్రమంలోనే ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకోవడానికి తన మరో స్నేహితుడైన కొప్పుల ధనరాజ్‌కు కూడా తన అసలు నంబర్ ప్లేట్‌నే వాడాల్సిందిగా మల్లికార్జున్ సూచించాడు. దీంతో వీరంతా కలిసి ప్రభుత్వ అధికారులను, ఫైనాన్స్ కంపెనీలను మోసం చేయాలనే ఉద్దేశంతో ఒకే నంబర్ ప్లేట్‌ను మూడు వేర్వేరు హోండా యాక్టివా వాహనాలకు ఉపయోగిస్తూ రోడ్లపై తిరుగుతున్నారు. చార్మినార్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ బృందం వారాసిగూడ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుండగా అజయ్ రెడ్డి పట్టుబడ్డాడు. అతనితో పాటు ఉన్న మిగిలిన ఇద్దరిని విచారించి, అధికారిక డేటాబేస్ ద్వారా వాహన ఇంజన్, చాసిస్ నంబర్లను పరిశీలించగా ఈ ఘరానా మోసం వెలుగుచూసింది. ఈ మేరకు నిందితులపై వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 318(4), 316(2) కింద క్రైమ్ నంబర్ 243/2026గా కేసు నమోదు చేశారు. ఈ మోసాన్ని చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో సబ్ ఇన్‌స్పెక్టర్లు కె. రామారావు, ఎమ్. మహేష్, ఎమ్. మధు, కానిస్టేబుల్ ఎన్. లక్ష్మణ్ ,వారాసిగూడ పోలీసులు సంయుక్తంగా ఛేదించినట్లు హైదరాబాద్ సిటీ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆందే శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రత్యేక ఎస్ఐఆర్ సహాయక కేంద్రం ప్రారంభం

- **ఓటరు జాబితా సవరణకు ఉచిత సేవలు అందుబాటులోకి**



**మొయినాబాద్, విశాలభారతి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు తమ దరఖాస్తులను సక్రమంగా సమర్పించుకునేలా ఈ కేంద్రం ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఓటరు నమోదు, పేరు మార్పు, చిరునామా మార్పు, ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు, ఇతర వివరాల సవరణతో పాటు ఎన్యూమరేషన్ ఫారమ్‌లు నింపడంలో గ్రామ ప్రజలకు ఉచితంగా సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సేవలు అందించడంతో పాటు, బీఎల్‌వోలు మరియు ఓటర్ల మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సరిచేసుకుని ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఈ సహాయక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరి రవి, బూత్ ఏజెంట్ సమీర్, కాంగ్రెస్ నాయకులు నవీన్, శ్రీకాంత్, భాను, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు గుంతల మరమ్మతులు ముమ్మరం

- **రోడ్డు గుంతల మరమ్మత్తులతో తప్పనున్న ప్రమాదాలు**
- **నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలి**
- **ప్రజాసమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తాం**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో రోడ్డుపై ఏర్పడిన గుంతల మరమ్మత్తులతో వాహనదారులకు ప్రమాదాలు తప్పనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశాల మేరకు పాల్వంచ పరిధిలోని అంబేద్కర్ సెంటర్లో ఏర్పడిన గుంతల పూడ్చటం, మరమ్మత్తు పనులు ఆదివారం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ఆదివారం స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ముఖ్యంగా ప్రయాణికుల ఇబ్బందులను త్వరితగతిన తొలగించడమే ధ్యేయంగా పెట్టుకున్నామని, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే ఈ ప్రాంతంలో పనులు వేగవంతం చేయడంపై దృష్టి సారించామని సాబీర్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్ గొర్ల అన్నపూర్ణ, సీపీఐ నాయకులు ఉప్పుశెట్టి సునీల్, ఆలపాటి ప్రసాద్ గొర్ల నరేష్, అంబాడిపూడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ ముఖ్య కూడలి విస్తరణకు సహకరించండి

- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
- **అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి**



**షాద్ నగర్, విశాల భారతి:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం ముఖ్య కూడలి విస్తరణకు పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. ఆదివారం షాద్ నగర్ ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.షాద్ నగర్ ముఖ్య కూడలి విస్తరణ కోసం చాలాకాలంగా ఈ అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారని ప్రజల రవాణా సౌకర్యార్థం చౌరస్తాను విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చౌరస్తా విస్తరణ జరిగితే పట్టణ ముఖచిత్రం మారబోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో చౌరస్తా విస్తరణకు సంబంధించి ఆయా పార్టీ నాయకులతో క్యాంపు కార్యాలయంలో సమావేశమైన సందర్భాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పట్టణ అభివృద్ధికి తలమానికమైన చౌరస్తా విస్తరణ కార్యక్రమానికి మరోసారి ప్రతిపక్ష నాయకులతో ఇతర విపక్ష నాయకులతో మేధావులతో సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తానని చౌరస్తా విస్తరణ మంకోసం అందరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇక విస్తరణ విషయంలో ఎవరికి ఏ అనుమానాలు అవసరం లేదని ప్రజల సహకారం అందరి సూచనల మేరకే విస్తరణ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు..ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లు ఖాజా పాషా(కెపి),నరసింహ రెడ్డి తదితరులున్నారు..

## కార్మికుల సంక్షేమమే సీపీఐ లక్ష్యం

- **అబ్దుల్లాపూర్ మెట్‌లో 150 లేబర్ కార్డుల పంపిణీ – ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయాలని నాయకుల పిలుపు**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3లో ఆదివారం భవన నిర్మాణ కార్మికులకు 150 లేబర్ కార్డులను పంపిణీ చేశారు. కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి లేబర్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం రవీంద్ర చారి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అర్హత కలిగిన కార్మికుడికి లేబర్ కార్డు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం కోసం సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.కార్యక్రమం అనంతరం లబ్ధిదారులు తమకు లేబర్ కార్డులు అందజేసిన సీపీఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, బీఓసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దాసరి ప్రసాద్, బీఓసీ మెట్ అధ్యక్షులు సాయిలు, సైదులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ప్రపంచ యుద్ధం... తెలంగాణ ఆదర్శం!

**డ్రగ్స్... ఈ రోజుల్లో ప్రతీ దేశం ఎదుర్కొంటున్న సమస్య ఇది. ప్రపంచ దేశాల భద్రతకు, ఆర్థిక వ్యవస్థలకు, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు సవాలుగా మారిన అంతర్జాతీయ నేర సామ్రాజ్యం. ఒకప్పుడు సరిహద్దులు దాటి రహస్యంగా జరిగే డ్రగ్స్ అక్రమ రవాణా... నేడు డార్క్‌నెట్, క్రిప్టోకరెన్సీ, అంతర్జాతీయ నేర ముఠాలు, సింథటిక్ డ్రగ్స్ రూపంలో మరింత ప్రమాదకరంగా విస్తరించింది. ఈ పరిస్థితుల్లో ఒక్కో దేశం విడివిడిగా పోరాడితే ఫలితం ఉండదని ప్రపంచం గుర్తిస్తోంది. అందుకే గువాహటిలో ఈనె 6, 7 తేదీల్లో జరుగుతున్న బ్రిక్స్ దేశాల డ్రగ్స్ కంట్రోల్ సంస్థల అధిపతుల సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.**



**విశాల భారతి**

2026 జూలై 6వ తేదీన బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహిస్తుండటం మరింత విశేషం. "బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ" అనే భావనతో ముందుకు సాగుతున్న భారత్... డ్రగ్స్ నియంత్రణలో కూడా చర్చలకే పరిమితం కాకుండా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని యావత్ ప్రపంచానికి పిలుపునిస్తోంది. గూఢచారి సమాచార మార్పిడి, సంయుక్త ఆపరేషన్లు, సింథటిక్ డ్రగ్స్‌పై ఉమ్మడి వ్యూహం, డార్క్‌నెట్ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాపై సమన్వయ చర్యలు, రసాయనాల అక్రమ మళ్లింపును అరికట్టడం వంటి కీలక అంశాలపై బ్రిక్స్ దేశాలు ఒకే వేదికపై చర్చించడం చాలా అవసరం. డ్రగ్స్ ముప్పు ఎంత తీవ్రంగా ఉందో ప్రపంచ గణాంకాలే చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి అనుబంధ యూఎన్‌వోడీసీ అంచనాల ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మాదకద్రవ్యాల బారిన పడ్డారు. ముఖ్యంగా సింథటిక్ డ్రగ్స్, కొత్త తరహా సైకోయాక్టివ్ పదార్థాల వినియోగం చాలా వేగంగా పెరుగుతోంది. ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు.

అంతర్జాతీయ నేర ముఠాలు, ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థ, మనీలాండరింగ్, సైబర్ నేరాలతో ముడిపడి ఉన్న బహుముఖ ముప్పు. అందుకే డ్రగ్స్‌పై పోరాటాన్ని ప్రపంచ దేశాలు ఇప్పుడు జాతీయ భద్రత అంశంగా చూస్తున్నాయి. భారత్ కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలతో పాటు అవగాహన, వ్యసన బాధితులకు చికిత్స, సమాజ భాగస్వామ్యానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ఈ మధ్య విడుదల చేసిన "నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 202629" ఈ దిశలో కీలక ముందడుగు అని గుర్తించాలి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, కేంద్ర దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ... డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నాయి. అయితే.. డ్రగ్స్‌పై పోరాటంలో చట్టాలు, దాడులు మాత్రమే సరిపోవు. దేశానికి లభించిన అతిపెద్ద బలం యువత. 140 కోట్లకు పైగా జనాభాలో అత్యధిక శాతం యువ శ్రామిక శక్తే. ఇదే భారత డెమోగ్రాఫిక్ డివిడెండ్. అలాంటి యువత మాదకద్రవ్యాలకు బానిసైతే అది వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు. దేశ ఆర్థికాభివృద్ధికి, సామాజిక స్థిరత్వానికి, భవిష్యత్తు మానవ వనరులకు తీవ్ర నష్టం. అందుకే.. డ్రగ్స్ నిర్మూలనను ఆరోగ్య సమస్యగా కాకుండా జాతీయ అభివృద్ధి అంశంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ జాతీయ పోరాటంలో తెలంగాణ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. భౌగోళికంగా అనేక రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండటంతో తెలంగాణను డ్రగ్స్ ముఠాలు రవాణా మార్గంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం దీనిని అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని కఠిన వ్యూహంతో ముందుకు సాగుతోంది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రగ్స్‌పై రాజీలేని వైఖరిని ప్రకటించింది. మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడంలో ఎలాంటి రాజకీయ, సామాజిక ఒత్తిళ్లకు తలొగ్గబోమనే సందేశాన్ని స్పష్టంగా ఇచ్చింది.

డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా "ఈగల్" (EAGLE) వ్యవస్థను ఏర్పాటు చేయడం దేశంలోనే వినూత్న చర్యగా చెప్పవచ్చు. రాష్ట్ర, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ప్రత్యేక నిఘా,




సమాచారం సేకరణ, సమన్వయ దర్యాప్తు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ వంటి అంశాల్లో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడమే కాకుండా, డ్రగ్స్ మాఫియా ఆర్థిక మూలాలను కూడా దెబ్బతీసేలా ఆస్తుల జప్తు చర్యలు చేపట్టడం ఈ వ్యూహంలో ప్రధాన బలం. ఈ మొత్తం పోరాటానికి తెలంగాణ పోలీసు శాఖ వెన్నెముకగా నిలిచింది. ముఖ్యంగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలో రాష్ట్ర పోలీసులు డ్రగ్స్ నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నారు. కేవలం కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం వరకు పరిమితం కాకుండా... డ్రగ్స్ వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించే దిశగా దర్యాప్తు సాగుతోంది. డ్రగ్స్ సరఫరాదారులు, ఫైనాన్సర్లు, మధ్యవర్తులు, వినియోగదారుల వరకు మొత్తం గొలుసును గుర్తించి చర్యలు తీసుకోవడం తెలంగాణ పోలీసింగ్ ప్రత్యేకతగా నిలిచింది. తెలంగాణ పోలీసులు ఇతర రాష్ట్రాలు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం పెంచి అంతర్రాష్ట్ర ముఠాలపై వరుస ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. భారీ మొత్తంలో గంజాయి, కొకైన్, ఎండీఎంఏ, సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు కీలక డ్రగ్స్ పెడ్లర్లను అరెస్టు చేస్తున్నారు. విదేశీయుల ప్రమేయం ఉన్న నెట్‌వర్క్‌లను కూడా ఛేదించడం రాష్ట్ర పోలీసుల సమర్థతకు ప్రత్యేక నిదర్శనం. డ్రగ్స్ నివారణపై తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు, విద్యార్థులతో ప్రత్యక్ష సమావేశాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం, యువతలో చైతన్యం వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు.. కుటుంబం, సమాజం, దేశం పట్ల బాధ్యత అనే భావనను యువతలో నాటే ప్రయత్నం జరుగుతోంది. డ్రగ్స్ వ్యాపారాన్ని అరికట్టడంలో మరో కీలక అంశం ప్రజల భాగస్వామ్యం. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయడం, పిల్లల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు గమనించడం, విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండటం, సమాజం బాధ్యతగా వ్యవహరించడం అత్యవసరం. డ్రగ్స్‌పై పోరాటం ప్రభుత్వానిదో, పోలీసులదో మాత్రమే కాదు. అది ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత. గువాహటిలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశం ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. డ్రగ్స్ మాఫియాకు సరిహద్దులు లేవు. అందుకే.. దేశాల మధ్య సహకారానికీ సరిహద్దులు ఉండకూడదు. సమాచారం పంచుకోవడం, సంయుక్త దర్యాప్తులు, ఆధునిక సాంకేతికత వినియోగం, ఆర్థిక నిఘా, సమన్వయ చర్యల ద్వారానే ఈ అంతర్జాతీయ నేర సామ్రాజ్యాన్ని బలహీనపరచగలం.

అదే సమయంలో తెలంగాణ అనుభవం కూడా దేశానికి ఒక పాఠంగా నిలుస్తోంది. స్పష్టమైన రాజకీయ సంకల్పం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక నిబద్ధత, డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలోని తెలంగాణ పోలీసుల కఠిన చర్యలు అమలు, ప్రత్యేక ఈగల్ వ్యవస్థ, ప్రజల భాగస్వామ్యం, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు కలిసి డ్రగ్స్ నిర్మూలనకు సమగ్ర నమూనాను రూపొందిస్తున్నాయి. యువతను కాపాడటం అంటే దేశ భవిష్యత్తును కాపాడటమే. ఒక యువకుడు డ్రగ్స్‌కు బానిస కావడం అంటే ఒక కుటుంబం ఆశలు మాత్రమే కాదు, దేశం ఉత్పాదక శక్తిలో ఒక భాగాన్ని కోల్పోవడమే. అందుకే.. డ్రగ్స్‌పై పోరాటం నిరంతర యుద్ధంగా కొనసాగాలి. బ్రిక్స్ వేదికపై భారత్ చూపుతున్న నాయకత్వం, తెలంగాణలో అమలవుతున్న కార్యాచరణ ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి, డ్రగ్స్ మాఫియాపై రాజీ లేదు. యువత భవిష్యత్తు విషయంలో రాజీ అసలే లేదు.



సాగర్ వనపర్తి, పాలసీ అనలిస్ట్

# అంబర్ నగర్ బస్తీ కమిటీ ఎన్నిక

- **ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**
- **బస్తీల అభివృద్ధికి సహకరిస్తామని హామీ**




**అంబర్ నగర్ బస్తీ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్ విశాల భారతి;** సికింద్రాబాద్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల వాసులు ఐకమత్యంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి తాము చేస్తున్న కృషిలో భాగస్వాములు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం అంబర్ నగర్ స్కూల్ వద్ద జరిగిన బస్తీ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అంబర్ నగర్ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నూతన అధ్యక్షులు బీ. నాగరాజు, ఉపాధ్యక్షులు సీ. సాయి కిరణ్, ప్రధాన కార్యదర్శి కే. సాయి చరణ్, జాయింట్ సెక్రటరీ పీ. రోహిత్ కుమార్, కోశాధికారి ఎన్. వరలక్ష్మీ, నేతలు పాక సాయి, సుంకు రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం తొలగింపును అడ్డుకుంటాం

- **చౌరస్తా సర్కిల్ మధ్యలో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించాలి**
- **బీఎస్పీ నేత,రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్**




**షాద్ నగర్,విశాల భారతి:** షాద్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కుట్రపూరితంగా విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని దీనిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు.ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే మహనీయుడని,అభివృద్ధికి దిక్సూచని ఆయన విగ్రహాన్ని చౌరస్తా నుంచి తొలగించే ఎలాంటి చర్యలనైనా సహించబోమని స్పష్టం చేశారు.గతంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ మరియు అంబేద్కర్ యువజన సంఘాలు,ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ సంఘాల ప్రతినిధులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని చౌరస్తాను విస్తరించి అదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు.రోడ్డు విస్తరణకు బీఎస్పీ పార్టీ ఎప్పుడూ అడ్డు చెప్పమని అందుకు అభ్యంతరం లేదని,అయితే విగ్రహాన్ని పూర్తిగా తొలగించే ప్రయత్నాలు జరిగితే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు గుండేటి నర్సింలు, జి. బాలయ్య, తుప్పరి కుమార్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శివగల్ల ఆంజనేయులు, చౌదర్‌గూడ మండల అధ్యక్షుడు చెన్నయ్య, షాద్‌నగర్ మున్సిపాలిటీ 15వ వార్డు ఇన్‌చార్జి అయ్యప్ప, సి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# బజార్ హత్నూర్ మండల ఉప సర్పంచ్ నూతన కార్యవర్గం ఎన్నిక

- **అధ్యక్షుడిగా రియాజ్ ఖాన్, ఉపాధ్యక్షుడిగా దేవర్ల శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక**



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల ఉప సర్పంచ్‌ల నూతన కార్యవర్గాన్ని ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు హాజరైన ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.కొలహరి గ్రామానికి చెందిన రియాద్ ఖాన్ అధ్యక్షుడిగా, వర్తమన్నూర్ గ్రామానికి చెందిన దేవర్ల శ్రీకాంత్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందిస్తూ, మండలంలోని ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రియాజ్ ఖాన్ మాట్లాడుతూ, ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి గ్రామస్థాయి సమస్యలను తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.ఉపాధ్యక్షుడు దేవర్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉప సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిటీ నాయకత్వంలో మండలంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి గా కాండ్లి ఉప సర్పంచ్ శ్రీ ఒడ్డెపెల్లి గంగయ్య ,ప్రధాన కార్యదర్శి గా గిర్నూర్ ఉప సర్పంచ్ శ్రీ గోల్లేనా రాజేందర్ గారు,కోశాధికారి పిప్రి ఉప సర్పంచ్ శ్రీ బొంగురాల విశాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో మండల ఉప సర్పంచ్ లు మరియు ఇచ్చోడ మండల ఉప సర్పంచ్ అధ్యక్షులు బద్దం రాంచందర్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీ అభివృద్ధికి సహకరించండి

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం**
- **అందజేసిన శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్**
- **కాలనీ సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీ అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీనగర్ కాలనీలో ఎలాంటి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టలేదని, గత ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్నోసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేయడంతో పాటు అవుట్‌లెట్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, పార్కు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులతో సమీక్షించి, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య, వైస్ ప్రెసిడెంట్ చైతన్య, జనరల్ సెక్రటరీ యాకూబ్ పాషా, జాయింట్ సెక్రటరీ హెచ్చిఎఫ్సి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 7 ఏళ్లుగా ఫ్లాట్లు లేవు... పుప్పాలగూడలో ప్రణీత్ బాధితుల బీభత్స ఆందోళన!



- **రూ. కోట్లు వసూలు చేసి మోసం చేశారా? ప్రణీత్ కన్స్ట్రక్షన్‌పై తీవ్ర ఆరోపణలు**
- **110 ఫ్లాట్లు... 220 మందికి అమ్మకం! డబుల్ రిజిస్ట్రేషన్ షాక్**
- **బిల్డర్ అదృశ్యం... రోడ్డెక్కిన ఫ్లాట్ కొనుగోలుదారులు**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

పుప్పాలగూడ ప్రాంతంలో ప్రణీత్ కన్స్ట్రక్షన్ సంస్థపై ఫ్లాట్ కొనుగోలు చేసిన బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమకు గత 7 సంవత్సరాలుగా ఫ్లాట్లు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపిస్తూ బాధితులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. బాధితుల వాదన ప్రకారం, ఒక్కో ఫ్లాట్ పేరుతో రూ.70 లక్షల నుంచి రూ.1 కోటి వరకు భారీ మొత్తాలను సంస్థ వసూలు చేసింది. అయినప్పటికీ ఇంత కాలం గడిచినా ఫ్లాట్లు హస్తాంతరం చేయకపోవడంతో వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. అంతేకాకుండా, మొత్తం 110 ఫ్లాట్లను 220 మందికి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారని వారు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఒకే ఫ్లాట్‌కు ఇద్దరు యజమానులు ఉన్న పరిస్థితి ఏర్పడిందని బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ప్రణీత్ గ్రూప్ అధినేత సురేష్, ఆయన కుమారుడు ప్రణీత్‌పై బాధితులు నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం సంస్థ ప్రతినిధులు అందుబాటులో లేరని, అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని వారు పేర్కొంటున్నారు. పలుమార్లు సంప్రదించే ప్రయత్నాలు చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో తాము నిరాశకు గురయ్యామని తెలిపారు. ఇళ్ల కోసం తమ జీవిత పొదుపులను పెట్టుబడి పెట్టామని, అప్పులు చేసి, బంగారం, పొలాలు తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించామని బాధితులు వాపోతున్నారు. ఇప్పుడు ఫ్లాట్లు రాకపోవడంతో ఒకవైపు అద్దె ఇళ్లలో నివసిస్తూ, మరోవైపు బ్యాంకు రుణాలు, వడ్డీలు, పిల్లల విద్యా ఖర్చులతో తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తమ జీవితం పూర్తిగా సంక్షోభంలో పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత సంస్థపై కఠిన చర్యలు తీసుకుని తమకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని లేదా ఫ్లాట్లు వెంటనే అప్పగించాలని వారు కోరుతున్నారు. బాధితులలో కొందరు 'న్యాయం జరగకపోతే ఆత్మహత్యే మార్గం' అని భావోద్వేగంతో పేర్కొనడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేయడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు రూ.325 కోట్లు

- **రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి,క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిట శ్రీహరి**
- **అన్నారం గ్రామంలో గిరిజన మహిళ నేనావత్ జ్యోతి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**
- **2,780 ఇళ్లు వివిధ దశల్లో పూర్తి**
- **720 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది**
- **ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?**
- **లబ్ధిదారురాలిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**షాద్ నగర్,(విశాల భారతి):**

నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సుమారు రూ.325 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని,స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పెద్దఎత్తున కృషి చేసి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించారని రాష్ట్ర పశుసంవర్ధక,మత్స్య, పాలాభివృద్ధి,క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిట శ్రీహరి తెలిపారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో గిరిజన మహిళ నేనావత్ జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని మంత్రి వాకిట శ్రీహరి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్డీవో ఎన్.ఆర్. సరిత,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చప్లా నాయక్, డిప్యూటీ ఇంజనీర్ సురేష్,ఏఈ సాయినాథ్, ఎంపీడీవో శ్రీకాంత్, ఎమ్మార్వో నాగయ్య తదితర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.గృహప్రవేశం సందర్భంగా మంత్రి,ఎమ్మెల్యే, అధికారులు లబ్ధిదారురాలు నేనావత్ జ్యోతి కుటుంబ సభ్యులకు సంప్రదాయం ప్రకారం కొత్త బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వాకిట శ్రీహరి మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దూరదృష్టితో పనిచేస్తున్నారని కొనియాడారు.ఒకే నియోజకవర్గానికి తొలి విడతలోనే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించి దాదాపు రూ.325 కోట్ల విలువైన పనులను చేపట్టించడం హర్షణీయమని అన్నారు.మంజూరైన 3,500 ఇళ్లలో ఇప్పటికే 2,780 ఇళ్లు వివిధ దశల్లో పూర్తవుతుండగా,మరో 720 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందని మంత్రి తెలిపారు.అన్ని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, ఎమ్మార్వో నాగయ్య, ఎంపీడీవో శ్రీకాంత్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చప్లా నాయక్, డిప్యూటీ ఇంజనీర్ సురేష్, ఏఈ సాయినాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ఇద్రీస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, శేఖర్ రెడ్డి, కుమార్ గౌడ్, శేఖర్, కృష్ణారెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, తుపాకుల శేఖర్, చందులాల్, శ్రీను నాయక్, చందు నాయక్, మురళీ మోహన్, అప్పి, ముబారక్ అలీ ఖాన్, నరేష్, కొప్పుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనంపల్లి జైపాల్ రెడ్డి ఎన్నిక



## రాజేంద్రనగర్‌లో ఘన సన్మానం

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ & కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర మున్సిపల్ సంఘం 4వ మహాసభలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ మహాసభల్లో రాష్ట్రం నలుమూలల నుండి పాల్గొన్న ప్రతినిధుల సమక్షంలో, రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన అంకితభావం కలిగిన కార్మిక నాయకుడు కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఎంతో గర్వకారణం. కామ్రేడ్ జైపాల్ రెడ్డి గారు గత ఎన్నో సంవత్సరాలుగా కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన నాయకత్వం ద్వారా కార్మికులకు మరింత న్యాయం జరుగుతుందని, వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి చేరుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఈరోజు డైరీ ఫారం చౌరస్తా వద్ద ఉన్న ఐబీ ప్యాలెస్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి గారికి శాలువా కప్పి, పూలమాలలు వేసి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ ( ఎస్ఎఫ్ఏ ) అయిన కె. అనిల్, వి. రాజు, బి. ఎల్లప్ప, జె. జగదీష్, బాబు మరియు ఇతర కార్మిక సహచరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, కార్మిక ఐక్యతను ప్రతిబింబించింది. ఈ ఎన్నిక మరియు సన్మానం కార్మిక సంఘానికి మరింత బలాన్ని చేకూర్చి, భవిష్యత్తులో కార్మికుల హక్కుల సాధనలో కొత్త దిశగా ముందుకు తీసుకెళ్తుందని అందరూ విశ్వాసం వ్యక్తం చేశారు.



# సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేకంగా బీజేపీ ధర్నా

## సీఎం,ఎమ్మెల్యే దిష్టిబొమ్మల దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

**షాద్ నగర్,విశాల భారతి:**

సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూర్‌లో భారీ ధర్నా నిర్వహించారు.కొత్తూర్ మండల బీజేపీ అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ధర్నా అనంతరం రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ సీఎం,ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు,కార్యకర్తలు ప్రయత్నించారు. అయితే పోలీసులు జోక్యం చేసుకుని దిష్టిబొమ్మల దహన కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు.స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవించి ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, బావండ్ల మాణిక్యం, సుధాకర్ అప్ప, మండల ప్రధాన కార్యదర్శి వన్నం శ్రీనివాస్, జి. శ్రీధర్ ఆచారి, బీజేపీ షాద్‌నగర్ టౌన్ ఉపాధ్యక్షుడు అల్లం అనిల్ గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, వన్నం జంగయ్య, కొండల ఆచారి, బి. నరసింహ, గోవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులున్నారు..



# సమంత కెరీర్‌లో మరో మైలురాయి

స్టార్ హీరోయిన్ సమంత మరోసారి తన స్టార్‌డమ్ ఏంటో మరోసారి చూపించింది.. సామ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైనప్పటి నుంచి అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతూ వరుస రికార్డులు సృష్టిస్తోంది. దర్శకురాలు నందిని రెడ్డి రూపొందించిన ఈ చిత్రం ఇప్పుడు టాలీవుడ్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన మహిళా ప్రధాన కథా చిత్రంగా నిలిచి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సాధారణంగా భారీ వసూళ్లు అంటే స్టార్ హీరోల సినిమాలే గుర్తుకొస్తాయి. కానీ ఈ ట్రెండ్‌ను పూర్తిగా మార్చేస్తూ సమంత తన సొంత స్టార్ పవర్‌తో 'మా ఇంటి బంగారం'ను భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టింది. కథ, భావోద్వేగాలు, సమంత నటన, నందిని రెడ్డి దర్శకత్వం కలిసి ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత దగ్గర చేశాయి.భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ 'మా ఇంటి బంగారం' అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉత్తర అమెరికా మార్కెట్‌లో ఈ సినిమా సంచలన కలెక్షన్లు నమోదు చేస్తోంది. విడుదలైన మూడు వారాలు పూర్తయ్యే సమయానికి ఈ చిత్రం 2 మిలియన్ అమెరికన్ డాలర్ల (2 Million Dollars) వసూళ్ల మార్క్‌ను దాటేసి మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.